# ఎర్త్ ఈజ్ రౌండ్

ఉదయం ఆరు న్నరయింది.

ఇంకా సూర్యోదయం కాలేదు.

తూర్పున బాగా మబ్బులు పట్టాయి.

హుస్సేన్ సాగర్ వైపు నుంచి చల్లటి గాలి వీస్తోంది.

టాంక్ బండ్ మీద ట్రాఫిక్ నెమ్మదిగా పెరుగుతోంది.


వయసులో వున్నవాళ్ళు, వయసు మళ్ళుతున్నవాళ్ళు, ముసలీ, ముతకా, పిల్లా, మేకా, ఆడా, మగా వాకింగూ, జాగింగూ చేస్తున్నారు. కొందరు ఎక్సర్‌సైజులు చేస్తున్నారు. మరికొందరు విగ్రహాల అరుగుల మీద కూర్చుని రిలాక్స్ అవుతున్నారు.

చెట్ల ఆకుల మీద నిలచిన మంచుబిందువులు గాలికి కదిలి జారి నేల మీద పడి అదృశ్యమవుతున్నాయి.

లోకంలో జీవకోటి సుఖశాంతులతో వర్ధిల్లుతూ వుండాలని హుస్సేన్‌సాగర్‌లో నిలబడి వున్న తథాగతుడు ఆశీర్వదిస్తున్నాడు.

చుట్టూ కనిపిస్తున్న కాంక్రీట్ జంగిల్ నిద్ర లేస్తోంది.

రంగనాయకులు మెత్తటి గడ్డి మీద చెప్పులు లేకుండా నడుస్తున్నాడు.




వాణిశ్రీ

అల్లూరి సీతారామరాజు విగ్రహం అరుగు మీద కూర్చున్న రామశాస్త్రి "ఇక చాల్లేవోయ్ నీ వాకింగూ! ఇట్లా వచ్చి కూర్చో!" అన్నాడు నవ్వుతూ.

"ఓయ్! శాస్త్రి! నీ వాకింగ్ పూర్తయిందా!" అడిగాడు రంగనాయకులు.

6-1-95 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

"నీ చిన్నప్పటి పల్లెటూరి జీవితం నీ మనసులో ముద్రించుకుపోయింది. అదంతా ఇప్పుడు తల్చుకుంటే గొప్పగా వుంటుంది. నిజమే. కాని రోజులు మారిపోయాయి. మార్పు చాలా సహజం. సిటీలో నువ్వు ఇల్లు అమ్ముకోయే ముందు, ఆ పల్లెటూళ్ళో పొలం కొనేలోగా నువ్వు కొన్నాళ్ళు ఆ వూళ్ళో కాపురం వుండి చూడు. ఆ జీవితం నీకు సంతృప్తి కలిగిస్తే అప్పుడే మకాం మార్చవచ్చు. నువ్వు తొందరపడకోయ్ రంగనాయకులూ!"

"నీ సలహా బాగుందోయ్ శాస్త్రీ! థాంక్యూ ఫర్ యువర్ గుడ్ సజెషన్" అన్నాడు రంగనాయకులు.

* * *

తెల్లవారుజామున తెనాలి బస్టాండ్‌లో బస్ దిగాడు రంగనాయకులు.

వేప పుల్లతో పళ్ళు తోముకుని క్యాంటీన్‌లో వేడి వేడి 'టీ' తాగాడు.

మూడు వందల కిలోమీటర్లు బస్సు ప్రయాణం చేయడంతో శరీరం బాగా అలసిపోయింది.

ఇంటికి వెళ్ళి హాయిగా నిద్రపోవాలనుకున్నాడు.

నిరంజనం వూళ్ళో వున్నాడో లేదో? వాడితో అన్ని విషయాలూ డిస్కస్ చేయాలి.

రంగనాయకులు ఆలోచిస్తూ తమ వూరెళ్ళే బస్సు కోసం ప్లాట్‌ఫారం మీద బెంచీపై కూర్చున్నాడు.

నిద్రలేమి వల్ల కళ్ళు మూసుకుపోతున్నాయి.

"ఒరేయ్! రంగనాయకులూ!"

రంగనాయకుల నిద్రమత్తు ఎగిరిపోయింది.

నిరంజనం అతని భుజం మీద చెయ్యివేసి ఆప్యాయంగా నిమిరాడు.

"అరే! నువ్వురా! నిరంజనం!" ఆశ్చర్యపోయాడు రంగనాయకులు.

వెదకబోయిన తీగె కాలికి తగిలినట్లయింది.

"నేనేలే! ఏమిటంత ఆశ్చర్యపోతున్నావ్? ఎప్పుడొచ్చావ్? హైదరాబాద్ మంచేనా?" అడిగాడు నిరంజనం.

"ఆ హైదరాబాద్ మంచే! ఇప్పుడే నైట్ ఎక్స్‌ప్రెస్ దిగాను. మన వూరి బస్సు కోసం ఎదురుచూస్తున్నాను. అది సరే! నువ్వేమిటి ఇంత పొద్దున్నే తెనాలి వచ్చావ్?"

'పెళ్ళయిన కొత్తలో ఇంటికి వెళితే నా భార్య ప్రేమగా నా కోసం ఎదురు చూసేది. ఆవిడ పెంచుకునే కుక్క మాత్రం నన్ను చూసి మొరిగేది'.
"మరి ఇప్పుడు".
"కుక్క వచ్చి ప్రేమగా తోకాడిస్తుంది. మా ఆవిడేమో మొరుగుతోంది". — కె.వి.

"నేను హైదరాబాద్ బయల్దేరాను. నీ దగ్గరికే" అన్నాడు నిరంజనం.

"నా దగ్గరికా? ఆశ్చర్యంగా వుందే. నేను నీ దగ్గరికి వస్తుంటే, నువ్వు నా కోసం బయల్దేరావా?" అన్నాడు రంగనాయకులు.

"లక్కీగా ఇక్కడ కలుసుకున్నాం కాబట్టి సరిపోయింది. లేకపోతే నీ కోసం నేనక్కడ, నా కోసం నువ్విక్కడ ఎదురుచూస్తూ గడిపేవాళ్ళం" అని నవ్వాడు నిరంజనం.

"ఏమిటి విశేషం? మరదలు బాగుందా? పిల్లలు లెటర్స్ రాస్తున్నారా?" అంటూ కుశలప్రశ్నలు వేశాడు రంగనాయకులు.

"ఆ ... బాగానే వుంది."

"హైదరాబాద్ ఎందుకు వస్తున్నావు? ఏదైనా కోర్టు పని తగిలిందా? మంత్రిగారితో వ్యవహారమా?"

"అటువంటి గొడవలేం కాదులే. నేను కూడా హైదరాబాద్‌కి మకాం మార్చాలని చూస్తున్నానురా! అద్దె కొంపల్లో ఎందుకు? ఏదైనా మంచి ఇల్లు కొందామని బయల్దేరాను" అన్నాడు నిరంజనం.

త్రుళ్ళిపడ్డాడు రంగనాయకులు.

అతనికి మతి పోయినట్లయింది.

తను హైదరాబాద్‌లో ఇల్లు అమ్మేసి, పల్లెటూరు వద్దామని ప్రయత్నిస్తుంటే, నిరంజనం పల్లెటూరు వదిలేసి సిటీలో సెటిల్ అవ్వాలని వస్తున్నాడా?

"ఏమిట్రా అట్లా వెర్రి మొఖం పెట్టావ్? నిజమే నేను చెప్పింది" అన్నాడు రంగనాయకులు నవ్వుతూ.

"ఎందుకంత దారుణమైన ఆలోచన వచ్చింది?"

"దారుణం ఏముంది?"

"ప్రశాంతమైన వాతావరణంలో హాయిగా బతుకుతూ."

"హాయిగా బతుకుదామనా?" అని విషాదకరంగా నవ్వాడు నిరంజనం.

"అదేం?"

"ఏం చెప్పమంటావురా? పాత రోజులు కావు. మన వూరు చాలా మారిపోయిందిరా రంగనాయకులూ! అప్పటి ఐకమత్యం, ఆప్యాయతలూ ఇప్పుడు మనుషుల మధ్య మచ్చుకైనా లేవు. ఊళ్ళోకి అన్ని రాజకీయాలూ ప్రవేశించి మనుషుల మనసుల్ని కలుషితం చేశాయి. ఇప్పుడు ప్రతి చిన్న విషయమూ రాజకీయం చేస్తున్నారు. కులాల కుమ్ములాటలు సర్వసాధారణమయ్యాయి. ముఠాలు కట్టినవాళ్ళు వూళ్ళేలుతున్నారు. మంచి మర్యాద మట్టికలిసిపోయాయి. మన పని మనం చేసుకోవడానికి గూడా అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. రోజులెలా వున్నాయంటే నా జోలికి ఎవడూ రాకుండా చూడు దేవుడా అని ప్రార్థనలు చేసుకునేలా వున్నాయి. ఇక ఎన్నికలొచ్చాయంటే మారణహోమమే. నాయకులు తగలబెట్టుకోవడాలు, తన్నుకోవడం, నరుక్కోవడం సర్వసామాన్యం. జనం పోలీసుల చుట్టూ, కోర్టుల వెంట, చోటా, మోటా నాయకుల ఇళ్ళ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. ఎన్నికలొస్తున్నాయంటే గుండె దడదడలాడుతోంది. ఈ లోపే వూళ్ళో మంచి మకాం ఎత్తేయాలని నిర్ణయించుకున్నాను."

రంగనాయకులు నోరు తెరుచుకుని నిరంజనం చెప్పే మాటలు వింటున్నాడు.


"ఇప్పుడు వూళ్ళల్లో కులం బలం వుంటేనే బతుకు. లేకపోతే అధోగతే. నీకు తెలుసుగా మన వూళ్ళో మన కులం వాళ్ళు ఎక్కువ మంది లేరు. వాళ్ళు గూడా అయినకాడికి పొలాలు, ఇళ్ళు వాకిళ్ళు అమ్మేసి వూరొదిలి పట్టణాలకి వలసపోతున్నారు."

రంగనాయకులు మాట పడిపోయినవాడిలా మౌనంగా వుండిపోయాడు.

"నువ్వెందుకు మన వూరొస్తున్నావు?" ప్రశ్నించాడు నిరంజనం.

"అబ్బే! ఏం లేదురా! రిటైరైపోయానుగదా! ఇంట్లో బోర్ కొట్టింది. మిమ్మల్నందర్నీ చూద్దామని బయల్దేరాను" అని దీర్ఘంగా నిట్టూర్చాడు రంగనాయకులు.

*




## హైకూలు

సౌధాల్లో ఏముంది,
ఫుట్‌పాత్ పిల్లోడు నయం,
వాడు, వెన్నెల్ని కప్పుకుంటాడు

పిల్లల్తో
కుందేళ్ళతో
ఆడుకోవడమే, వెన్నెల పని

పిల్లలు నిద్రపోయాక,
తీరుబడిగొచ్చింది వెన్నెల,
ఇంతకి ఎందుకొచ్చినట్టు!

కొబ్బరాకుల్ని
గోదావరి అలల్ని
తాకేదే వెన్నెల!

— [redacted]